

తాండూరు మునిసిపల్ కమిషనర్‌గా విక్రమ్‌సింహారెడ్డి?



తాండూరు, జనవరి 25: తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా విక్రమ్‌సింహారెడ్డి రానున్నట్లు సమాచారం. గతంలో ఆయన ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం వనపర్తి మున్సిపల్ ఫుల్ అడిషినల్ చార్జి కమిషనర్‌గా ఉన్నారు. తాండూరులో పని చేసేందుకు విక్రమ్‌సింహారెడ్డి ఆసక్తి చూపుతుండడంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆయన పేరును సీడీఎంకు పంపారు.

అందుతున్న రైతుబంధు



క్రమంగా రైతుల ఖాతాల్లో జమవుతున్న నగదు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం కొత్త పాలనలో నిదానంగా అమలవుతోంది. నిధుల కొరత కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని క్రమక్రమంగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. వికారాబాద్ జిల్లాలో మొత్తం 2,95,796 మంది రైతుబంధు లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 1,70,600 మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేశారు. కొన్నాళ్ల పాటు నిలిచిన నగదు బదిలీ ఐదారు రోజులుగా మళ్లీ ప్రారంభమైంది. కాగా ఇప్పటి వరకు రెండెకరాల లోపు రైతులకు మాత్రమే రైతుబంధు అందింది. రానున్న కొన్ని రోజుల్లో అందరికీ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- పంపిణీ వేగాన్ని పెంచిన ప్రభుత్వం
- సాధ్యమైనంత త్వరలో అందరికీ నగదు బదిలీ
- వానాకాలం నాటికి పెంచే యోచనలో సర్కార్

వికారాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాసంగి పంటకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు(పెట్టుబడి సాయం) పంపిణీ ప్రక్రియలో వేగం పెరిగింది. గత డిసెంబరు 7న బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగి రైతులకు అదే నెల 12 నుంచి రైతుబంధు పంపిణీ ప్రక్రియను ప్రారంభించింది. అయితే ఖజానాలో రైతుబంధు మొత్తానికి సరిపడా నిధులు లేక ప్రారంభంలో తక్కువ విస్తీర్ణం కలిగిన రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. నిధుల కొరత కారణంగా కొన్ని రోజుల పాటు రైతుబంధు ప్రక్రియ నిలిచింది. జనవరి మొదట్లో ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం, వృద్ధాప్య ఇతర పింఛన్లు, ఇతర అత్యవసర అవసరాలకు నిధులు కేటాయించాల్సి రావడంతో ఈ నెల రెండోవారం వరకు వరకు రైతుబంధు పంపిణీకి ఆటంకాలు ఏర్పడ్డాయి. సంక్రాంతి తరువాత రైతులకు రైతుబంధు జమ చేయడం ప్రారంభించారు. జనవరి నెలాఖరులోగా గతంలో రైతుబంధు వచ్చిన రైతులందరికీ నగదు జమచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ మేరకు రైతుబంధు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు రెండెకరాల లోపు ఉన్న రైతులకు రైతుబంధు జమైంది. కాగా ఇతర చెల్లింపులను నిలిపివేసి మొదట రైతుబంధును వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించడంతో పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

1.7లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ

యాసంగిలో జిల్లాలో 2,95,796 మంది రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉంది. గతనెల ఎకరం లోపు విస్తీర్ణం కలిగిన కొంత కొందరు రైతులకు నగదు బదిలీ చేశారు. తిరిగి ఐదారు రోజులుగా రైతులకు జమ చేస్తున్నారు. కాగా ఈ యాసంగికి 2,27,884 మంది రైతులకు రూ.181,72,03,296 రైతుబంధు చెల్లించేలా ట్రెజరీకి పంపారు. మూడెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన రైతులకు కొన్ని రోజుల్లోగా అందరికీ రైతుబంధు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

వానాకాలం నుంచి 'రైతుభరోసా' ఎకరానికి రూ.7,500

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకానికి విధివిధానాలు ఇంకా ఖరారు చేయలేదు. ఈ యాసంగి వరకు గత ప్రభుత్వం అమలు చేసిన విధంగానే రైతుబంధు మొత్తాన్ని ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఇప్పటి వరకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరాకు ప్రతీ పంటకు ఏడాదిలో రెండుసార్లు రూ.5వేల వంతున పెట్టుబడి సాయం చేసింది. కాగా తాము అధికారంలోకి వస్తే రైతులకు, కౌలు రైతులకు ప్రతీ ఫసల్‌కు ఎకరానికి రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఈ మేరకు రానున్న వానకాలం సీజన్ నుంచి ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు పంటలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

మొత్తం రైతుబంధు లబ్ధిదారులు	2,95,796
రైతులకు చెల్లించాల్సిన మొత్తం	రూ. 322.76 కోట్లు
ట్రెజరీకి పంపిన రైతు ఖాతాల సంఖ్య	2,27,884
ఇప్పటి వరకు నగదు జమైన వారి సంఖ్య	1,70,600
కేటాయించిన 'రైతుబంధు' నిధులు	181,72,03,296
రైతులకు అందిన పెట్టుబడి సాయం	రూ. 97,02,24,824

విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వం కసరత్తు

కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెలన్నర పూర్తయింది. కాంగ్రెస్ సర్కారు అమలు చేయబోయే రైతుభరోసా పథకానికి సంబంధించి విధివిధానాలను రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై సీఎం తన క్యాబినెట్ సహచరులు, తోటి ఎమ్మెల్యేలు, వ్యవసాయరంగ నిపుణులతో దీనిపై చర్చిస్తున్నారు. రైతుభరోసా అమలు, ఎన్ని ఎకరాల వరకు నగదు ఇవ్వాలి, కాస్తులో ఉన్న భూములకే నగదు సాయం చేయాలా? లేక పట్టా ఉన్న చిన్న, సన్నకారు రైతులందరికీ ఇవ్వాలా? పెద్ద రైతులకు ఇవ్వాలా? వద్దా? అలాగే కౌలుదారుల గురించి ఏం చేయాలి? కౌలు అగ్రిమెంట్ చేసేదెవరు? తదితర అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. కొత్త మార్గదర్శకాలు జారీ కాని నేపథ్యంలో ఈ సీజన్‌కు పాత విధానాన్నే కొనసాగించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. వానాకాలం నాటికి రైతుభరోసా మార్గదర్శకాలను సిద్ధం చేయడమే కాకుండా ఎకరానికి రూ.7,500 చొప్పున అందించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోగానే రైతుభరోసాపై రాష్ట్ర సర్కారు తన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎలాగూ ఈ యాసంగి సీజన్ పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సీజన్లో పాత విధానంలో రైతుబంధు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లోక్‌సభ ఎన్నికల నాటికి ఎకరానికి పెంచి ఇచ్చే మొత్తంపై ప్రభుత్వం తన విధానాన్ని వెల్లడిస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్ జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఆవరణలో గురువారం జరగనున్న గణతంత్రం దినోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ వద్ద రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహిస్తారు. 75వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చేశారు. జాతీయ పతాకావిష్కరణ మొదలు సభావేదిక, సభాస్థలి, ఆవరణలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. వేడకలో పాల్గొనేందుకు వచ్చే వీఐపీలు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తాగునీరు, టెంట్లు, కుర్చీలు, విద్యుత్ లైట్లు, బ్యారికేడ్లు ఏర్పాట్లు చేశారు. సభావేదికను అలంకరించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గణతంత్ర దినోత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 9గంటలకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలనుద్దేశించిన ఆయన ప్రసంగిస్తారు. బాలబాలికలతో విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి అవార్డులను ప్రదానం చేస్తారు. అలాగే వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఇదిలా ఉంటే, గణతంత్ర వేడుకల కోసం జిల్లాలో కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాట్లు చేశారు.



పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్ చేస్తున్న పోలీసులు

'రిపబ్లిక్ డే' పరేడ్ రిహార్సల్స్

వికారాబాద్, జనవరి 25: నేటి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసులు గురువారం రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ కోటిరెడ్డి రిపబ్లిక్ డే ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సలహాలు సూచనలు చేశారు. రిహార్సల్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు సూరపునాయుడు, అంజత్ పాషా, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాంబండ గిరి ప్రదక్షిణ పూజలు



పాంబండ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కులకచర్ల, జనవరి 25: బండవెల్కిచర్ల పాంబండ గిరి ప్రదక్షిణ పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గురువారం పౌర్ణమి సందర్భంగా భక్తులు పాంబండకు తరలివచ్చారు. ప్రతీ పౌర్ణమి రోజు వేలాది మంది పాంబండ గిరి ప్రదక్షిణ పూజల్లో పాల్గొంటారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని అప్పట్లో బాబ్రీ మసీద్ కూల్చివేతలో పాల్గొన్న ఈ ప్రాంత కరసేవకులను భక్తులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రహ్లాద్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, టీచర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టాఫీసు వద్ద బీపీఎం కోసం ఎదురుచూస్తున్న పింఛన్‌దారులు

పోస్టాఫీస్‌కు తాళం

- పింఛన్ల కోసం తిరుగుతున్న వృద్ధులు

బషీరాబాద్, జనవరి 25: మండలంలోని నవాల్గ బ్రాంచ్ పోస్టాఫీస్‌కు తాళం పడింది. రెండు రోజులుగా పోస్టాఫీసు తెరుచుకోక పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసే బ్రాంచ్ పోస్ట్ మాస్టర్(బీపీఎం) సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని స్థానికులు గురువారం సర్పంచ్ లాలప్ప తెలిపారు. పనుల కోసం రోజూ పోస్టాఫీస్ వస్తున్నా తాళం ఉంటోందని సర్పంచ్‌కి చెప్పారు. పింఛన్ కోసం వృద్ధులు వచ్చి పోతున్నారు. ఈ బ్రాంచ్ పరిధిలో రోజూ ఉత్తరాల బట్వాడా కూడా సరిగా చేయడం లేదని లేదని ప్రజలంటున్నారు. ఈ విషయమై బీపీఎంకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా తాను అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నానని తెలిపారు. ఉద్యోగి పరిస్థితి ఎలా ఉన్నా ప్రజల ఇబ్బందుల దృష్ట్యా పోస్టల్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలతో కార్యాలయం తెరిపించాలని సర్పంచ్ కోరారు. ఉద్యోగి వ్యక్తిగత కారణాలతో ఆఫీసును బంద్ పెట్టడం సరికాదన్నారు.

స్టేట్ హైవే పక్కనే షెడ్ల నిర్మాణం

- చోద్యం చూస్తున్న యంత్రాంగం
- అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం
- కుచించుకుపోతున్న రాజీవ్ రహదారి
- పట్టింపు లేని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్
- తూంకుంటలో కంచె చేను మేస్తున్న వైనం



తూంకుంట-హకీంపేట రూట్లో స్టేట్ హైవే పక్కనే నిర్మించిన షెడ్లు

శామీర్‌పేట, జనవరి 25 : అది మునిసిపాలిటీ. పైగా ప్రధాన స్టేట్ హైవేపై ఉంది. ఈ రోడ్డు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. దీనిపై అడ్డూ అదుపు లేకుండా కంచే చేనుమేస్తున్న చందంగా ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలను నివారించాల్సిన అధికారులు లోలోన కుమ్మక్కై బయటకు మాత్రం తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారు. కళ్ల ముందే అక్రమంగా భారీ నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఈ తంతు తూంకుంటలో రెండేళ్లుగా సాగుతోంది. పట్టణంలో రాజీవ్ రహదారి బస్టాప్ నుంచి దొంగల మైసమ్మ చౌరస్తా వరకు.. అలాగే తూంకుంట-హకీంపేట రోడ్డులో సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేశారు. స్టేట్ హైవే స్థలంలో పెద్ద షెడ్లు, హోటళ్ల, శాశ్వత భవనాలను, పాన్ షాపులు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టారు. పెద్దగా ఉన్న ఈ రోడ్డు పక్కన ఎక్కడికక్కడ నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డు కుచించుకుపోతోంది. దీంతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఆక్రమణలను చూస్తే మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది అంతా కుమ్మక్కు అయినట్టు స్పష్టమవుతోంది. విశేషమేమంటే ఆక్రమణలు జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది సైతం అక్రమంగా హోటల్, కమర్షియల్ భవనాలను, అపార్ట్‌మెంట్లు, షెడ్లను నిర్మిస్తున్నారు.

పత్తాలేని ఎన్‌ఫోర్స్‌మెంట్

తూంకుంట పరిధిలో రెండేళ్లుగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మున్సిపల్ అధికారులు, టీపీవో, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పత్తాలేకుండా పోయారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకొని, ఉన్న వాటిని కూల్చాల్సిన అధికారులు మిన్నకుంటున్నారు. ఎవరిష్టం వచ్చినట్టు వారు నిర్మాణాలు చేపడుతుంటే మునిసిపాలిటీ ఎందుకని ప్రజలు మండిపడుతున్నారు. అలాగే పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలతో హెచ్‌ఎండీఏకు కోట్లాది రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారు. కాగా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న తూంకుంట మునిసిపాలిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కలెక్టరే చర్యలను తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

18సంవత్సరాలు నిండిన వారు
ఓటరుగా నమోదు కావాలి

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వికారాబాద్, జనవరి 25 : 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం ఎన్నెపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ కాంప్లెక్స్ వరకు అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, స్వీప్ నోడల్ అధికారి మల్లేశం నేతృత్వంలో కళాశాల, పాఠశాలల విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి అధికారులు, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వయోవృద్ధ ఓటర్లు, యువ ఓటర్లను కలెక్టర్ శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో యువత పాత్ర కీలకం అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనాలంటే ముందుగా ఓటరుగా నమోదు అయ్యి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదు కావడం సులభం అని.. ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు నమోదుకు సమ్మర్ రివిజన్ నిర్వహిస్తూ ప్రతీ బూత్‌లో అధికారులను నియమించి దరఖాస్తులను స్వీకరించామన్నారు. కులం, మతం, వర్గాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, లేదంటే భవిష్యత్తు తరాలకు నష్టం జరుగుతుందన్నారు. ప్రతీ ఎన్నికల్లోనూ పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతోందని, దీని అధిగమించేందుకు ప్రతీ ఒక్కరు చొరవచూపాలన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారికే ఓటు వేయాలని సూచించారు. ప్రభుత్వాన్ని ఎన్నుకునేది ఓటేనని ప్రజలు గుర్తించాలన్నారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి మాట్లాడుతూ.. అతి పెద్ద ప్రజాస్వామ్యం, లిఖిత రాజ్యాంగం కలిగినది మన భారత్ అన్నారు. యువత ఓటరుగా పేరు నమోదు చేసుకొని చుట్టుపక్కల వారికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, స్వీప్ నోడల్ అధికారి ఎన్.మల్లేశం, వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోల్ అబ్జర్వర్ జ్యోతి బుద్ధప్రకాశ్

ఓటరు జాబితా కీలకం

వికారాబాద్: ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా గుండెకాయ వంటిదని, క్షేత్రస్థాయిలో బీఎల్వోలు, బీఎల్ఏల సహకారంతో తప్పులు లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలని రోల్ అబ్జర్వర్ జ్యోతి బుద్ధప్రకాశ్(ఐఏఎస్) అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డితో కలసి ఓటరు జాబితాపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. బుద్ధప్రకాశ్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ నాయకుల సహకారంతో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకొని బీఎల్వోల ద్వారా పక్కా ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన ఓటర్ల పేర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. పక్కా ఓటరు జాబితా రూపకల్పనకు బీ ఎల్‌ఓలు, బీఎల్‌ఏ తరచూ సమావేశాలు నిర్వహించుకొని జాబితాను సిద్ధంచేయాలన్నారు. ప్రతీ బీఎల్‌ఓ తన వద్ద ఫామ్స్ 6, 7, 8లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వారు డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన వారు లేనట్లు ప్రతీ పేజీపై సంతకం చేయాలన్నారు. జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ బాగుందని అబ్జర్వర్ ప్రశంసించారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించనున్న నేపథ్యంలో మార్పులుచేర్పులు సరి చేస్తున్నామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని కాలేజీల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి యువతీయువకులకు ఓటర్లుగా నమోదు చేశామన్నారు. సమావేశంలో వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, విజయకుమారి, శ్రీనివాసరావు, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.




వ్యవసాయ కార్మిక సంఘం
భవన నిర్మాణానికి నిధుల సేకరణ

దోమ, జనవరి 25: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా భవన నిర్మాణాన్ని ఢిల్లీలో నిర్మించేందుకు ప్రజల నుంచి నిధుల సేకరణకు వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం దిర్సంపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి నిధుల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, రఘురాం, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, మొగులయ్య, శేఖర్, కృష్ణ, సాయిబాబు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లెమోనిగూడలో కార్డన్‌సెర్చ్

● 31 వాహనాల సీజ్


మల్లెమోనిగూడలో తనిఖీ చేస్తున్న సీఐ వెంకటరామయ్య

పరిగి, జనవరి 25: పరిగి మున్సిపల్ పరిధిలోని మల్లెమోనిగూడలో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. మొత్తం 31వాహనాలను సీజ్ చేశారు. 25బైక్‌లు, మూడు త్రీవీలర్స్, మూడు ఫోర్‌వీలర్స్ వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాలకు ఆర్‌సీలు, ఫిట్‌నెస్ లేకున్నా సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీశైలం, గిరన్నలు పాల్గొన్నారు.


పన్ను వసూళ్లలో అలసత్వం వహించరాదు

కీసర రూరల్, జనవరి 25: పన్ను వసూళ్లలో అలసత్వం వహించరాదని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కమిషనర్ రాజేందర్‌కుమార్‌తో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కేవలం 45శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయన్నారు. గడువు సమీపిస్తున్నందున పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తైన ఇళ్లకు పన్నులను నిర్ధారించి వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధానిగా గెలవాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి


వికారాబాద్, జనవరి 25: ప్రపంచంలో భారత్ నెంబర్-1 గా ఎదగాలంటే ప్రధాని మోదీ మళ్లీ గెలవాలని మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలోనూతన ఓటర్లతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ. భారత్ స్థాయిని ప్రపంచంలో నెంబర్‌వన్‌గా నిలబెట్టగలిగే శక్తి కేవలం ప్రధాని మోడీకి మాత్రమే ఉందన్నారు. అదేవిధంగా వచ్చే ఎన్నికల్లో యువత మొత్తం బీజేపీ వైపు చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విజయరాజ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్ గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి, బీజేవైఎం మోమిన్‌పేట మండల ప్రెసిడెంట్ ఆసిరెడ్డి, నరోత్తంరెడ్డి, బసవలింగం విద్యార్థులు పాల్గొన్నారు.

















గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

'స్వీప్'లో వికారాబాద్‌కు రెండో స్థానం

● గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం

వికారాబాద్/కులకచర్ల, జనవరి 25 : ఓటరు నమోదు ప్రక్రియ 'స్వీప్' కార్యక్రమాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచింది. ఓటరు నమోదు, ఓటరు అవగాహన సదస్సులు, ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించడంలో జిల్లా ముందంజలో ఉంది. అలాగే ఓటర్ల నమోదు, ఓటుహక్కు వినియోగించుకునే విషయంలో చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల స్కిట్‌కు రెండో బహుమతి లభించింది. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా స్వీప్ జిల్లా నోడల్ అధికారి కోటాజీ, చౌడాపూర్ స్కూలు విద్యార్థులతో కలిసి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, జిల్లా ఎన్నికల అధికారి కోటాజీ, హెచ్‌ఎం సురేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ పనులు చేపట్టాలి


రైల్వే శాఖ డీఆర్‌ఎంకు వినతి సమర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 25: మేడ్చల్‌లో నిలిచిన రైల్వే అండర్ పాస్ పనులు త్వరగా పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైల్వే శాఖ సికింద్రాబాద్ డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నిలిచిన అండర్ బైపాస్ పనుల కారణంగా నాలుగు సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయనకు వివరించారు. ఈ మేరకు వచ్చే ఆదివారం నుంచి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఎం హామీ ఇచ్చినట్లు జడ్పీచైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, ఎల్లంపేట ఎంపీటీసీ కుమార్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక బీజేపీని ఓడించండి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

● ఆమనగల్లులో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ


ఆమనగల్లులో ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ

ఆమనగల్లు , జనవరి 25 : దేశంలో కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక , రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేయాలని వారు సూచించారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను, పెంచిన నిత్యావసరాల ధరలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. వందలాది ట్రాక్టర్లతో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతులు, రైతు కూలీలు , రైతు సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాగర్, మధుసూధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రైతాంగ పోరాటాల ఫలితంగా దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను ఉప సంహరించుకుని పార్లమెంట్‌లో బిల్లు పెడుతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి మళ్లీ డొంక దారిన నల్ల చట్టాలను అమలు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ విధానాలను దేశ ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుసంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్త కార్యాచరణను రూపొందించినట్లు చెప్పారు. రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక రాంచందర్, పి.అంజయ్య, కార్యదర్శి కె.జగన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కానుగుల వెంకటయ్య, ఆర్.జంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల భాస్కర్, జిల్లా సహాయకార్యదర్శి రామకృష్ణారెడ్డి, సంయుక్తకార్యదర్శి ముసలయ్య, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, రైతుసంఘం నాయకుడు వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు అరుణ్, కురుమయ్య, లాలునాయక్, బాలు, యాదయ్య, పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

● ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి


మహిళా గ్రామసభలో ఐసీడీఎస్ అధికారులు

ఆమనగల్లు , జనవరి 25 : బాలికల సంరక్షణ అందరిబాధ్యత అని ఐసీడీఎస్ మండల సీడీపీవో సక్కుబాయి అన్నారు. కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో గురువారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీవో హాజరై విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. రాంనుంతల గ్రామ పంచాయతీలో సర్పంచ్ సోనశ్రీనునాయక్ అధ్యక్షతన మహిళా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సక్కుబాయి మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఎంపీటీసీ సరితపంతూనాయక్, ఎస్‌వో పద్మజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భక్తశబరి, జయమ్మ, పార్వతి, పద్మ, కేజీబీవీ, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

● యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ భాస్కర్


ప్రతిజ్ఞ చేయిస్తున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ భాస్కర్, కళాశాల అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25 : విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడి తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్‌పీ భాస్కర్ అన్నారు. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్ ఏసీఈ ఇంజనీరింగు కళాశాలలో గురువారం మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలుంటాయని చెప్పారు. మత్తుకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. అనంతరం మత్తుపదార్థాలకు అలవాటు కావొద్దని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ బీఎల్ రాజు, అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, జీవన్‌రెడ్డి, రాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.300 కోట్లు


వెంకట్‌రెడ్డికి నివేదిక అందిస్తున్న గురునాథ్‌రెడ్డి, తదితరులు

కొడంగల్, జనవరి 25 : నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధి పనుల కోసం రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గురువారం కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఈ నివేదికలను అందించారు. దశల వారీగా ఐదు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సిన పనులున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో క్రీడా ప్రాంగణం, పార్కులు, పాత కొడంగల్ సమీపంలో బస్తీ దవాఖాన, స్వాగతతోరణం, తాండూర్ నుంచి కోస్గి రోడ్డు మధ్యలో విద్యుత్ దీపాల అలంకరణ, షాదీఖానా నిర్మాణం, పాత భవనాల కూల్చివేత, వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులకు ప్రతిపాదనలు అందించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేక కడా ఏర్పాటుతో అన్నివిధాలుగా అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారు అన్నారు. నిధులు మంజూరయ్యాక పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 25 : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించినప్పుడే రోడ్డుప్రమాదాలను నివారించగలుగుతామని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ అన్నారు. రోడ్డుభద్రతా వారోత్సవాల సందర్భంగా గురువారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలోని డ్రైవర్లు, పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాలను నివారించడానికి డ్రైవర్లు ట్రాఫిక్ భద్రత నియమాలను విధిగా పాటించాలని సూచించారు. బస్టాప్‌లలో కాకుండా రోడ్లపై అనవసరంగా బస్సులను ఆపరాదని, యూటర్న్ తీసుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మైనర్లకు తల్లితండ్రులు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లితండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కార్లలో వెళ్లే వారు సీట్ బెల్ట్‌ను విధిగా ధరించాలన్నారు. ఆర్టీసీ డీఎం ఉషా, ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్, సిబ్బంది జితేందర్‌రెడ్డి, నర్సింహాగౌడ్, మస్తాన్ వలి, శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


మండల కేంద్రంలో మాట్లాడుతున్న చేవెళ్ల డిప్యూటి డీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, జనవరి 25 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అమ్మఒడి అనే యాప్ సేవలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది వివరాలను యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. గర్భిణీలకు అందిస్తున్న వైద్యసేవలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. పసి పిల్లలకు, గర్భిణీలకు టీకాలు క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. వైద్యులు రేవతి, సుదర్శన్, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అనుమతి లేని నిర్మాణాలు

● పట్టించుకోని అధికారులు

● ప్రభుత్వ ఆదాయానికి గండి


మర్రిపల్లిగూడలో నిర్మించిన అక్రమనిర్మాణాలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25: బఫర్‌జోన్‌లో జోరుగా అక్రమనిర్మాణాలు వెలుస్తున్నాయి. అయినా పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ అటు పంచాయతీకి, ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని మర్రిపల్లిగూడ రెవెన్యూ పరిధి బఫర్‌జోన్‌లోని సర్వేనెంబర్లు 51, 53లలో అక్రమనిర్మాణాలు వెలుస్తున్నాయి. ఘట్‌కేసర్ -ఎదులాబాద్ మార్గంలో రోడ్డుపక్కనే పెద్దఎత్తున్న నిర్మాణాలు చేపట్టారు. అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. 60గజాల్లో నిర్మాణాలు చేపడితే అనుమతులు లేవని హడావిడి చేసే అధికారులు ఇంతపెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నా ఏం చేస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే పనులు నిలిపివేస్తూ మిగతా సమయాల్లో నిర్మాణాలను పూర్తిచేసుకుంటున్నారు. ముఖ్యంగా సెలవురోజులు వచ్చాయంటే అక్రమనిర్మాణాల జోరుపెంచుతూ పనులు ముగించుకుంటున్నారు. ఇప్పటికైనా మర్రిపల్లిగూడ బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమనిర్మాణాలను కూల్చివేస్తాం



మరిపల్లిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 51, 53లలో వెలసిన అనుమతి లేని నిర్మాణాలకు నోటీసులిచ్చాం. పై అధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలను కూల్చివేస్తాం

- శ్రీనివాస్, కార్యదర్శి మర్రిపల్లిగూడ

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి


నర్సప్పగూడలో కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

నందిగామ, జనవరి 25: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సప్పగూడలో అంజయ్యయాదవ్ స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలతోనే మమేకమై ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుదామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, రాజగోపాల్, సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ కళమ్మ నాయకులు మామిళ్ల విఠల్, సుదర్శన్‌గౌడ్, జంగిలి కుమార్, సత్యం, భూపాల్, నర్సింహ, శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌తో వంశీచంద్‌రెడ్డి భేటీ


సీఎం తో భేటి అయిన వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు , జనవరి 25 : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డితో గురువారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు , కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు, ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి తదితర విషయాలపై చర్చించారు. పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని వంశీచంద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

కోదండరాంకు ఎమ్మెల్సీ పదవిపై హర్షం


కోదండరాంను సన్మానిస్తున్న సోమశేఖర్

తాండూరు, జనవరి 25: తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టడంపై తాండూరు తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీతో ఆయనను గౌరవించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీజేఎస్ ఇన్‌చార్జి, తెలంగాణ ఉద్యమకారుడు, కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. కోదండరాం చట్టసభల్లో ఉంటే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ఉపాధి పనులకు వెళ్లి కూలీ మృతి

కడ్తాల్ , జనవరి 25 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఓ కూలీ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాలో గురువారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గోవిందాయిపల్లి తండాకు చెందిన కేతావత్ రాములు (44) రోజు మాదిరిగా ఉదయం 9 గంటలకు ఉపాధి పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రాములును మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య శారద, నలుగురు పిల్లలు ఉన్నారు. రాములు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక సర్పంచ్ రామునాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

గ్రామాల్లో బీఎస్పీని బలోపేతం చేస్తాం

షాబాద్ /చేవెళ్ల, జనవరి 25 : గ్రామాల్లో బహుజన్ సమాజ్ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బర్క కృష్ణయాదవ్ అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో బీఎస్పీ నూతన మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో బీఎస్పీని బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు వేస్తున్నామన్నారు. షాబాద్ మండల అధ్యక్షుడిగా కందివనం శ్రీశైలం, కోశాధికారిగా పెండాల చందును ఎంపిక చేసి నియామక పత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి రాజ మహేంద్రవర్మ, అధ్యక్షుడు చందు, జిల్లా కార్యదర్శి కర్రే శ్రీశైలం, మండల ఉపాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి మహేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, సతీష్, రమేశ్‌యాదవ్, విజయ్‌కుమార్, నర్సింలు, జంగయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఎంఈవో అక్బర్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

చేవెళ్ల, జనవరి 25 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని ఎంఈవో అక్బర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో అంకురం ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు, వంటకాలు, ఉత్పత్తులను పాఠశాలలో విక్రయానికి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, ప్రిన్సిపాల్ టేనావతి, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున్న డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్

డీఎంహెచ్‌వోకు ఫస్ట్ బెస్ట్ అవార్డు

వికారాబాద్, జనవరి 25: రాష్ట్రస్థాయిలో 2023 సంవత్సరానికి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పల్వాన్ కుమార్ అత్యున్నత ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు ఫస్ట్ బెస్ట్ వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని హోటల్ ప్లాజాలో గురువారం తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, డైరెక్టర్ ఆఫ్‌పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్‌లు అవార్డును అందజేశారు.

ఓటు వజ్రాయుధం లాంటిది



పరిగిలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో విజయకుమారి



తాండూరు రూరల్‌: పట్టణంలోని చౌరస్తా వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



ఘట్‌కేసర్‌: ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్‌ అధికారులు



కొడంగల్‌: తహసీల్దార్‌ కార్యాలయంలో వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

పరిగి, జనవరి 25: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువ వజ్రాయుధంలాంటిదని వికారాబాద్‌ ఆర్డీవో విజయకుమారి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం పరిగిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులపై ఓటుహక్కుపై ప్రమాణం చేయించారు. సీనియర్‌ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ ఆనంద్‌ రావు, డిప్యూటీ తహసీల్దార్లు మోహన్‌, మల్లికార్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ జైతురాంనాయక్‌ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌, అధికారులు, సిబ్బంది, బీఎల్‌వోలు ప్రతిజ్ఞ చేశారు.

ఘట్‌కేసర్‌: 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఘట్‌కేసర్‌, పోచారం మున్సిపాలిటీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో పోచారం మున్సిపల్‌ చైర్మన్‌ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీ వైస్‌ చైర్మన్‌ పల్లగ మాధవరెడ్డి, కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్‌ కళాశాలలో జరిగిన ఓటరు అవగాహన సమావేశంలో ఘట్‌కేసర్‌ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచారం: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని యాచారం డిప్యూటీ తహసీల్దార్‌ లక్ష్మణ్‌ అన్నారు. జాతీయ ఓటు హక్కును పురస్కరించుకుని గురువారం యాచారం మండల కేంద్రంలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్పల్లి: 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మర్పల్లి తహసీల్దార్‌ గణేశ్‌ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మర్పల్లి జిల్లా పరిషత్‌, ఉర్దూ మీడియం, మోడల్‌ స్కూల్‌ విద్యార్థులతో పాత బస్టాండ్‌ నుంచి తహసీల్దార్‌ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విద్యాసాగర్‌, హెచ్‌ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్‌ టౌన్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్‌ ధైర్మన్‌ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్‌ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో పద్మశ్రీ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధిలోని స్పూర్తి జూనియర్‌ కళాశాల విద్యార్థులతో కలిసి చైర్‌పర్సన్‌ మర్రి దీపిక నర్సింహారెడ్డి, కమిషనర్‌ త్రిలేశ్వరరావులు ర్యాలీ నిర్వహించి వివేకానంద విగ్రహం వద్ద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

తాండూరు రూరల్‌: సమాజంలో ఓటు బలమైన ఆయుధమని తాండూరు తహసీల్దార్‌ తారాసింగ్‌ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం తాండూరులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, పాఠశాలల విద్యార్థులతో ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

కీసర రూరల్‌: పౌరులందరూ ఓటు విలువ తెలుసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్‌ కమిషనర్‌ రాజమల్లయ్య అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో మున్సిపల్‌ సిబ్బంది, అధికారులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ చిరంజీవులు పాల్గొన్నారు.

కొడంగల్‌: ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి నిదర్శనమని కొడంగల్‌ నియోజకవర్గ ఓటు నమోదు అధికారి, వికారాబాద్‌ జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌, కొడంగల్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ ఆథారిటీ ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డి, తహసీల్దార్‌ బి.విజయ్‌కుమార్‌ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా గురువారం కొడంగల్‌ పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులతో స్థానిక పోస్టాఫీస్‌ నుంచి వినాయక చౌరస్తా మీదుగా అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

బొంరాస్‌పేట్‌: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్‌ వెంకటేష్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాలక్ష్మమ్మ చౌరస్తాలో ఓటు హక్కును కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

మోమిన్‌పేట్‌: ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు అని తహసీల్దార్‌ మనోహరచక్రవర్తి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట కార్యాలయాల సిబ్బందితో కలిసి గురువారం ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారెడ్డి, ఆర్‌ఐ రాజు, ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, ఏఈయం రాజు, జూనియర్‌ అసిస్టెంట్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

దోమ: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్‌ పురుషోత్తం వృద్ధ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కులకచర్ల, చౌడాపూర్‌ మండల కేంద్రాల్లో రెవెన్యూ అధికారులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. కులకచర్ల వివేకానంద కళాశాలలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్‌ మురళీధర్‌ తెలిపారు. చౌడాపూర్‌లో విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి వృద్ధ ఓటర్లు రామయ్య, బుక్కమ్మలను తహసీల్దార్‌ ప్రభులు సన్మానించారు.

పెద్దేముల్‌: సామాన్యుడికి ఓటే ఒక ఆయుధం వంటిదని, దానిని తప్పక ఉపయోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌ మహేష్‌ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దేముల్‌ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులతో రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. పెద్దేముల్‌ ప్రధానచౌరస్తాలోని అంబేడ్కర్‌ విగ్రహం ముందు ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌ సీనియర్‌ సిటిజన్లను సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి ఆర్‌ఐ రాజిరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

మూడు కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుపడిన నిందితులను చూపుతున్న ఘట్‌కేసర్‌ ఎక్సైజ్‌ పోలీసులు

ఘట్‌కేసర్‌ రూరల్‌, జనవరి 25: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో అక్రమంగా గంజాయి నిల్వచేసిన ఇద్దరు నిందితులను ఎక్సైజ్‌ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్‌ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌ ఎక్సైజ్‌ పోలీసుస్టేషన్‌ పరిధిలోని మేడిపల్లి మండలం, బోడుప్పల్‌లో ఓ ఇంట్లో అక్రమంగా గంజాయిని నిల్వచేశారనే విషయం తెలిసి పోలీసులు తనిఖీ చేశారు. ఆ ఇంట్లో 2కిలోలు, ఆవరణలో పార్కుచేసిన స్కూటీలో మరో కిలో గంజాయి వారికి లభించింది. ఆ ఇంట్లో ఉన్న బంగారి సాయికుమార్‌(19), కర్రి శివాజీ(23)ని విచారించగా ఒడిస్సా నుంచి తక్కువ ధరకు తెచ్చి మేడిపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. మూడు కిలోల గంజాయితో పాటు స్కూటీని కూడా స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాండూరు రూరల్‌, జనవరి 25: మనస్తాపంతో ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని జినుగుర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జినుగుర్తి గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి(26) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని తండ్రి మోహన్‌రెడ్డి పలుమార్లు మందలించినా వినలేదు. బుధవారం రాత్రి శ్రీకాంత్‌రెడ్డి మద్యం తాగి ఇంటికి రాగా, ఎందుకు మద్యం తాగావని అతడి తండ్రి అడిగాడు. దీంతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం మోహన్‌రెడ్డి తమ పొలానికి వెళ్లగా అక్కడ శ్రీకాంత్‌రెడ్డి చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కిందికి దింపగా అప్పటికే ఆయన మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరి, వేరుశనగ పంటల పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న యమున

దారూరు, జనవరి 25: గట్టేపల్లి, రుద్రారం, రాంపూర్‌, అవుసుపల్లి, దారూరు గ్రామాల్లో సాగుచేసిన వరి, వేరుశనగ పంటలను ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో అగ్గితెగులు సోకే అవకాశం ఉన్నందున నస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆమె రైతులకు సూచించారు. ఆమె వెంట దారూరు ఏఈవో సంజాలాక్షి, రైతులు ఉన్నారు.

వికసిత్‌ భారత్‌ క్యాలెండర్ల ఆవిష్కరణ



వికసిత్‌ భారత్‌ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్‌ రాములు

మేడ్చల్‌ టౌన్‌, జనవరి 25: కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న వికసిత్‌ భారత్‌ కార్యక్రమానికి సంబంధించిన వార్షిక క్యాలెండర్‌ను గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కమిషనర్‌ రాములు ఆవిష్కరించారు. మేడ్చల్‌ అసెంబ్లీ కన్వీనర్‌ ఆనంద్‌ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్‌ కట్‌ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు

బషీరాబాద్‌, జనవరి 25: మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్వగ్రామమైన బషీరాబాద్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యేతో కేక్‌ కట్‌ చేయించిన కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛాలతోసన్మానం నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి ఫోన్‌లో నారాయణరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తనయుడు రోహిత్‌మహరాజ్‌ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎం.రాకేష్‌, డాక్టర్‌సంపత్‌కుమార్‌, కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు కలాల్‌నర్సింహులు గౌడ్‌, యూత్‌ ప్రెసిడెంట్‌ రవిశంకర్‌, రాములునాయక్‌, మాజీ ఎంపీటీసీ నరేష్‌చౌహాన్‌, రాజుగౌడ్‌, శ్రీనివాస్‌, పవన్‌ఠాగూర్‌, సాయిలొగౌడ్‌, సిద్ధార్థ, నాయకులు గోపాల్‌రెడ్డి, మునిందర్‌ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభం

దోమ, జనవరి 25: పోలిరెడ్డిపల్లిలో సర్పంచ్‌ వరలక్ష్మీ శంకర్‌ గురువారం నూతన గ్రామపంచాయతీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవంతో గ్రామప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా యువకులకు క్రికెట్‌ కిట్టు, వాలీబాల్‌ కిట్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌ కావలి గోవర్దన్‌, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యూత్‌ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని మొగిలిగుండ్ల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని సర్పంచ్‌ అంజమ్మ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంపీవో సుశీల్‌కుమార్‌, ఉపసర్పంచ్‌ నాగప్ప, వార్డు సభ్యులు కవిత, అంజయ్య, నర్సింహులు, బాల్‌రాజ్‌, లక్ష్మయ్య, ప్రభాకర్‌, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదలకు రెవెన్యూ సిబ్బందిని నియమించాలి

శామీర్‌పేట, జనవరి 25: ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసేందుకు రెవెన్యూ సిబ్బందిని నియమించాలని అలియాబాద్‌ సర్పంచ్‌ గుర్క కుమార్‌, రైతులు తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు వారు గురువారం శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయానికి విచ్చేసి తహసీల్దార్‌ సత్యనారాయణను కలిసి ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. శామీర్‌పేట పెద్ద చెరువు నుంచి అలియాబాద్‌, జగ్గంగూడ ప్రాంతాలకు వెళ్లే ఆయకట్టు సాగునీరు కాలువల ద్వారా రైతులు పంటలను సాగుచేస్తున్నారని తెలిపారు. ఇద్దరు రెవెన్యూ సిబ్బందిని నియమించి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. సాగునీటి కాలువలకు రెవెన్యూ సిబ్బంది లేక రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు తహసీల్దార్‌తో అన్నారు. ఈ సమస్యపై పరిశీలించి పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటానని తహసీల్దార్‌ సత్యనారాయణ రైతులకు సూచించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందజేత

కొడంగల్‌, జనవరి 25: కొడంగల్‌ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. హాస్టల్‌ వార్డెన్‌ రాధిక గురువారం కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌, ప్రచార కార్యదర్శి ఎస్‌.సోమశేఖర్‌లతో కలిసి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా



మూడుచింతలపల్లి: ఉద్దెమర్రిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మూడుచింతలపల్లి, జనవరి 25: ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని మాజీ మంత్రి, మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలో గురువారం దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనంతో పాటు దుకాణ సముదాయాన్ని సర్పంచ్‌ ఆనంరావు రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించేందుకు వాటర్‌ ఫిల్టర్‌ను ప్రారంభించారు. మేడ్చల్‌లో 61 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు వేశానని, 120 ఆలయాలను కట్టించానని చెప్పారు. అందరూ ఎన్నికల్లో గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని చెబుతారని తాను అలా కాదని, ముందే అన్ని పనులు పూర్తిచేసి ఎన్నికలకు వెళ్లానని గుర్తుచేశారు. మేడ్చల్‌ నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించినందుకు వారి ఆశీస్సులు ఎల్లప్పుడు తన పై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ మధుకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్‌ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీ హరిక, సర్పంచ్‌ అనురాధ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌, వార్డుసభ్యులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామలో దేశానికి పట్టుకొమ్మలు

కీసర: గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. యాద్గార్‌పల్లిలోని నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌ చైర్మన్‌ మాస వెంకటేష్‌, ఎంపీపీ ఇందిర లక్ష్మీనారాయణ, సర్పంచ్‌ పుల్ల రాజు, ఉపసర్పంచ్‌ మల్లేష్‌, ఎంపీటీసీ జూపల్లి వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ సేవలు చిరస్మరణీయం

మేడ్చల్‌ టౌన్‌: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అందులో భాగంగా లింగాపూర్‌-బర్కత్‌గూడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని మల్లారెడ్డి ప్రారంభించారు.

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని శ్రీరంగవరం, లింగాపూర్‌ గ్రామాల్లో నిర్మించిన నూతన పంచాయతీ భవనాలు, డ్వాక్రా భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయేందర్‌ రెడ్డి, నాయకులు రాజమల్లారెడ్డి, విజయేందర్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత

స్వయం ఉపాధిలో రాణించాలి

ఘట్‌కేసర్‌: యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి కొర్రెముల్‌ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బేకరిని గురువారం ఆయన ప్రారంభించారు. నలుగురికి ఉపాధి కల్పించే మార్గాన్ని ఎంచుకున్న శ్రీకాంత్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ రెడ్డియా నాయక్‌, సహకార సంఘం చైర్మన్‌ సింగిరెడ్డి రాంరెడ్డి, సర్పంచులు భైరు రమాదేవి రాములుగౌడ్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ముస్తాబు



బొంరాస్‌పేట్‌: పూర్యానాయక్‌ తండా ప్రాథమిక పాఠశాలలో తోరణాలు కడుతున్న విద్యార్థులు



పరిగిలో జెండా దిమ్మెకు మువ్వెన్నెల రంగులు వేస్తున్న ఉద్యోగులు

దోమ / కొడంగల్‌ రూరల్‌, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దోమ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు, మండల శాఖ కార్యాలయాల్లో జాతీయ జెండా తోరణాలతో ముస్తాబు చేశారు. అదేవిధంగా కొడంగల్‌ పట్టణంలోని తహసీల్దార్‌, ఎంపీడీవో, మున్సిపల్‌, వ్యవసాయ శాఖ తదితర కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు తోరణాలతో ముస్తాబు చేశారు. బొంరాస్‌పేట్‌ మండలంలోని పూర్యానాయక్‌ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పాఠశాల ఆవరణలో తోరణాలు ఏర్పాటు చేశారు.

పరిగి: పరిగిలో కార్యాలయాలను శుభ్రం చేయడం, జాతీయ జెండాలు అలంకరించడం అదేవిధంగా పాఠశాలల ఆవరణలు పరిశుభ్రం చేయడం, తరగతి గదుల్లో జెండా కాగితాలు అతికించడం, జెండాలను అలంకరించడం వల్ల పనులలో నిమగ్నమయ్యారు.

త్రివర్ణంగా వంటకాలు



త్రివర్ణ వంటకాలను ప్రదర్శిస్తున్న రిసార్ట్‌ యాజమాన్యం

శామీర్‌పేట: జనవరి 26 న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శామీర్‌పేటలోని సెలబ్రిటీ రిసార్ట్‌లో యాజమాన్యం, సిబ్బంది అతిథులకు ప్రత్యేకంగా త్రివర్ణ రూపంలో వంటలను ఎంతో ఆకర్షణీయంగా తయారుచేసి వడ్డిస్తున్నారు. గురువారం సెలబ్రిటీ రిసార్ట్‌ను అతిథులకు నోరూరించే విధంగా అలరించే త్రివర్ణ పతాక కలర్‌ఫుల్‌గా వివిధ రకాల వంటలను తయారుచేసి ఎంతో ఆకర్షణీయంగా ప్రదర్శించి అతిథులు కోరిన విధంగా వడ్డించి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిసార్ట్‌ జీఎం అమిత్‌, సెల్స్‌ అండ్‌ మార్కెటింగ్‌ మేనేజర్‌ కళ్యాణి, సూపర్‌వైజర్‌ అజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేతో రామ్మోహన్‌రెడ్డి భేటీ

పరిగి,జనవరి 25: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో గురువారం రాత్రి ఓ హోటల్‌లో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్‌ టి.రామ్మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల గురించి ఖర్గేతో చర్చించారు. ఈసారికూడ జాతీయ హోదా కల్పించాలని ఖర్గేను కోరగా, సాను కూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

కళాకారులను ఆదరించాలి

ఘట్‌కేసర్‌ రూరల్‌, జనవరి 25: సమాజంలో కళాకారులను ఆదరించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అవుషాపూర్‌ ఎంపీపీ నివాసంలో గురువారం అదే గ్రామానికి చెందిన 20మంది డప్పు కళాకారులకు పైసెస్‌రెడ్డి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో పాటు డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏనుగు లక్ష్మారెడ్డి, మత్స్యేందర్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

తాండూరు

అర్బన్‌ సీఐగా సంతోష్‌కుమార్‌

తాండూరు, జనవరి 25: తాండూరు అర్బన్‌ సీఐగా సంతోష్‌కుమార్‌ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సంతోష్‌కుమార్‌ బదిలీపై తాండూరుకు వచ్చారు. తాండూరులో రెండు సంవత్సరాల తొమ్మిదినెలల పాటు పనిచేసిన సీఐ రాజేందర్‌రెడ్డి ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్లు

తాండూరు, జనవరి 25: 8వ వార్డు కౌన్సిలర్‌ వెంకటేష్‌ (కాంగ్రెస్‌), 14వ వార్డు కౌన్సిలర్‌ బబితా (ఎంఐఎం) తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎన్నికైన తర్వాత అన్నిరంగాల్లో మార్పు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్‌ మురళీగౌడ్‌, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ అబ్దుల్‌ రవూఫ్‌ పాల్గొన్నారు.

కులకచర్లలో శివదీక్షలు

కులకచర్ల, జనవరి 25: మండలంలో శివదీక్షలు ప్రారంభమయ్యాయి. బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం 200మందికిపైగా భక్తులు శివదీక్షలు తీసుకున్నారు. ఆలయ అర్చకులు పాండుశర్మ భక్తులకు శివమాల ధారణ చేశారు. 41రోజులపాటు దీక్షలు చేసి శివరాత్రికి శ్రీశైలం వెళ్లి మల్లికార్జునస్వామిని దర్శించుకుని దీక్షలు విరమిస్తారు.

ధారూరు: స్థానిక వీరభద్రేశ్వర ఆలయంలో గురువారం భక్తులు శివమాలలు ధరించి శివదీక్షలు ప్రారంభించారు. ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, శివలింగం, వీరభద్రేశ్వర స్వామి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం 11మంది శివదీక్షలు చేపట్టగా ఆలయ పూజారి చెన్నబసవయ్య స్వామి వీరికి శివమాలలు వేశారు.

ఫర్టిలైజర్‌ దుకాణాన్ని సీజ్‌ చేయాలి

పరిగి: జనవరి 25: పరిగిలో కల్తీ విత్తనాలు విక్రయిస్తున్న శ్రీమహేశ్వరి సీడ్స్‌ అండ్‌ ఫెర్టిలైజర్‌ దుకాణాన్ని వెంటనే సీజ్‌ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పరిగి ఏవో ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ పూడూరు మండలం సిరిగాయపల్లికి చెందిన ఓ రైతు పరిగిలోని శ్రీమహేశ్వరి సీడ్స్‌ అండ్‌ ఫెర్టిలైజర్‌ దుకాణంలో విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేస్తే ఏపుగా పెరిగింది కానీ, ఒక గింజ కూడాపట్టలేదన్నారు. విత్తనాల గురించి సదరు రైతు దుకాణ యజమానిని అడిగితే వింత సమాధానం ఇచ్చాడన్నారు. అధికారులు స్పందించి షాపును సీజ్‌ చేసి యజమానిపై పీడీయాక్టు నమోదు చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు హబీబ్‌, లాలయ్య అనిల్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

నేడు జంగమ సమాజం జిల్లా కార్యవర్గ ఎన్నికలు

వికారాబాద్‌, జనవరి 25: జంగమ సమాజం వికారాబాద్‌ జిల్లా కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం(నేడు) నిర్వహిస్తున్నట్లు సమాజం రాష్ట్ర అధ్యక్షుడు రుమాండ్ల విశ్వేశ్వరయ్య, ఉపాధ్యక్షుడు విభూతి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి మఠం శివకుమార్‌ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు వికారాబాద్‌లోని శ్రీమలి కార్జున భవనంలో ప్రారంభమయ్యే ప్రత్యేక సమావేశంలో జిల్లాలోని అన్ని తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు జంగమ సమాజం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని వారు వివరించారు. సమాజం రాష్ట్ర కమిటీ తరఫున మఠం రాజశేఖర్‌ ఎన్నికల పరిశీలకుడిగా హాజరవుతారని వారు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **పెద్దేముల్‌:** మండలంలోని హన్మాపూర్‌ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ లొంక నర్సింహులు ఆయన భార్య ఎంపీటీసీ లొంకసీలు కలిసి ఇందూరు పాఠశాలకు గురువారం డిజే బాక్సులు అందజేశారు. పాఠశాలలో జరిగే ఏకార్యక్రమానికైనా సౌండ్‌ బాక్సులు తప్పనిసరి కావాల్సి వస్తోంది. అయితే వాటిని అద్దెకు తేవడానికి పాఠశాల ఉపాధ్యాయులకు అదనపు వ్యయం అవుతోందని తెలిసి తమ వంతుగా లొంక సీలు, నర్సింహులు డీజే బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

● **కులకచర్ల:** అంతారంలో గురువారం సీమ మాసయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి అంత్యక్రియల కోసం ఆయన కుటుంబానికి ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో రూ.9600 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో శివరాములు, బచ్చయ్య, గోపాల్‌, గ్రామస్థులు మొగులయ్య పాల్గొన్నారు.

● **కొడంగల్‌:** కాంగ్రెస్‌ పార్టీ కొడంగల్‌ మైనార్టీ సెల్‌ మండల అధ్యక్షుడు అనీఫ్‌ఖాన్‌ తన సోదరుడు ముస్తఫా వివాహానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సీఎంను కలిశారు. ఆహ్వానపత్రికను అందజేశారు.

● **వికారాబాద్‌:** వర్సిటీ భూభాగాన్ని జీవో నెంబర్‌55 ప్రవేశపెట్టి హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం చాలా బాధాకరమని ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌ హరీష్‌ రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిన్న హైదరాబాద్‌ రాజేంద్రనగర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిరసన చేస్తుంటే పోలీసులు రోడ్డుపై జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లడం దారుణమన్నారు. మహిళా నాయకురాలిపై ఆ విధంగా ప్రవర్తించడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనరల్‌ సెక్రెటరీ జగదీష్‌, మంజునాథ్‌ రెడ్డి ఎస్‌ ఎఫ్‌ డి కన్వీనర్‌, శివశంకర్‌, అభిలాష్‌ పాల్గొన్నారు.